ఆల్ సోల్స్ స్మరణలో..

- పూర్వీకుల ఆత్మ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు
- క్రైస్తవ శ్మశానవాటికల్లో 'ఆల్ సోల్స్ డే'
- ఆత్మీయుల సమాధుల వద్ద కన్నీటి నివేదన
- హాజరైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

సమాధిని పూలతో అలంకరిస్తున్న మహిళలు

క్రైస్తవ శ్మశానవాటికలో పూలతో అలంకరించిన సమాధులు

బోయిగూడ క్రైస్తవ శ్మశానవాటికలో తమ ఆత్మీయులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 2: ప్రతి ఏటా నవంబర్ 2న జరుపుకునే 'ఆల్ సోల్స్ డే' (సకల ఆత్మల దినం) సందర్భంగా శనివారం పెద్ద ఎత్తున క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను సందర్శించి నివాళులర్పించారు. తమ వారి జ్ఞాపకార్థం ఆయా శ్మశానవాటికల్లో ప్రార్థనలు నిర్వహించారు. సమాధులను పూలతో అలంకరించారు. వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుకున్నారు. న్యూబోయిగూడలోని క్యాథలిక్, వెస్లీ, బాప్టిస్ట్ క్రైస్తవుల శ్మశానవాటికలో జరిగిన కార్యక్రమానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మేరీ మాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. క్యాథలిక్ చర్చి ఫాదర్ ఆరోగ్యం, క్రిస్టియన్ శ్మశానవాటిక ఇన్‌చార్జి జయరాజ్, విజయ్, సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు సమాధుల వద్ద బంధువులు, ఆత్మీయులు కన్నీటి పర్యంతం అయ్యారు.

ప్రార్థనల కోసం ఏర్పాట్లు..

శ్మశానవాటికల అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం, లోపల చెత్తా చెదారం తొలగింపు, పరిసరాల పరిశుభ్రత, అదనంగా హెలోజెన్ లైట్లు ఏర్పాటు చేయడం, ప్రహరీ గోడలకు పెయింటింగ్ వేయించడం, ఇతర మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయించినందుకు తమ క్రిస్టియన్ సంఘం తరపున సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్మశానవాటికకు హాజరైన ప్రజలకు కూల్‌డ్రింక్స్, తాగునీరు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేశన్‌రాజు, లక్ష్మిపతి, బాల్‌రెడ్డి, ఎం.సురేశ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరమణ, ముక్కా శ్రీను పాల్గొన్నారు.

ఆత్మీయుల సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న వృద్ధురాలు

అగ్నిప్రమాదాల నివారణపై జాతీయ సదస్సు

అమీర్‌పేట్, నవంబర్ 2: ఔషధ పరిశ్రమల్లో చోటు చేసుకుంటున్న అగ్ని ప్రమాదాలపై నిపుణులతో కలిసి పరిష్కారమార్గాలపై లోతుగా చర్చించేందుకు ఈనెల 7 నుంచి రెండు రోజుల పాటు ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్ (ఎఫ్ఈఎస్ఏ) హెచ్ఐసీసీలో జాతీయ సదస్సు జరుగనుంది. ఫైర్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ సదస్సును గురించి వివరాలను శనివారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరి, హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ప్రసాద్ నిష్టల, దక్షిణ భారత విభాగం డైరెక్టర్ ప్రసాద్‌రాజుతో పాటు బ్రాండింగ్ విభాగం చైర్మన్ మనోజ్ బాలకృష్ణన్, ఆపరేషన్స్ విభాగం వైస్‌చైర్మన్ పి.శ్రవణ్‌కుమార్, కార్యదర్శి చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. ఔషధ పరిశ్రమల్లో చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను గురించి ప్యానల్ డిస్కషన్, నివారణకు అందుబాటులో ఉన్న ఉత్పత్తులు, సేవలను 30 మంది ఎగ్జిబిటర్లు ప్రదర్శించనున్నారని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, ఇందుకోసం ప్రత్యేకంచి ఎలక్ట్రికల్ వంటి కీలకఅంశాలపై జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులు అమూల్యమైన సలహాలు, సూచనలు చేస్తారన్నారు. అగ్నిప్రమాదాలకు నివారణ మార్గాలు చూపబోతున్న సదస్సుకు దాదాపు 300 మంది ఔషధ పరిశ్రమల సీనియర్ మేనేజర్లతో పాటు 100కు పైగా పరిశ్రమలు పాల్గొంటున్నాయని తెలిపారు.

బీబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ అనాలెటిక్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ వినియోగాదారుల దినోత్సవం

చిక్కడపల్లి, నవంబర్ 2: విద్యుత్ సమస్యల పరిష్కానికి ఆదివారం వీఎస్‌టీలో చౌరస్తాలోని ఆజామాబాద్ డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు డివిజనల్ డీఈ కమల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల బిల్లులు, సరఫరాలో అంతరాయం, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదుగురికి కారుణ్య నియామకాలు

సిటీబ్యూరో (నమస్తే తెలంగాణ) : జలమండలిలో ఐదుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ఐదుగురు ఉద్యోగుల వారసులకు విద్యార్హతను బట్టి ఉపాధి కల్పించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శనివారం ఎండీ అశోక్‌రెడ్డి నియామక పత్రాలు అందించి, ఆయన వారికి శుభాకాంక్షలు తెలుపు తూ కష్టపడి పనిచేసి బోర్డుకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎన్సీ రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యూజిక్‌లో శిక్షణ

పాటలను ఆలపిస్తున్న విద్యార్థులు

చిక్కడపల్లి, నవంబర్ 2: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ పాటలతో సబికులను ఆకట్టుకున్నారు. ఎనేబులింగ్ లీడర్‌షిప్ క్రియేట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థుల సంగీత ప్రదర్శన శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ హైదరాబాద్ మేనేజర్ ప్రదీప్ మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 9వ తరగతి విద్యార్థులకు అదేవిధంగా ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు మ్యూజిక్, ఫుట్‌బాల్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. లీడర్‌షిప్ స్కిల్స్, లైఫ్ స్టైల్ స్కిల్స్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పృథ్వీ, సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన

వారాసిగూడలో అధికారులతో కలిసి డ్రేనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, నవంబర్ 2: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ రోడ్డు నం.9లో నిత్యం డ్రైనేజీ పొంగుతుందని స్థానికుల ఫిర్యాదుతో అధికారులతో కలిసి కార్పొరేటర్ శనివారం పరిస్థితిని పరిశీలించారు. తాత్కాలికంగా సీవరేజీ పైప్‌లైన్ నుంచి చెత్తను, మట్టిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని జీహెచ్ఎం సీసీ ఏఈ కౌశిక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాముచారి, జామ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి, నవంబర్ 2: ముషీరాబాద్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముచ్చకుర్తి పద్మ పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత పూజ


కాళీమాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న స్థానికులు

ముషీరాబాద్, నవంబర్ 2: అడిక్‌మెట్ డివిజన్ సత్యానగర్ కమ్యూటీహాల్లో బెంగాలీ సమితి ఆధ్వర్యంలో శనివారం కాళీమాత పూజ, అన్నదానం జరిగింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముఠా జయసింహ, కె.సురేందర్, అబ్బు, యూనిస్, మహమూద్, యాదగిరి, ప్రసాద్, పింటూ, అంకిత్ పాల్గొన్నారు.

కార్తిక మాసం పూజలు ప్రారంభం

రామలింగేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న పవన్‌కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులు

సికింద్రాబాద్, నవంబర్ 2: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం సికింద్రాబాద్‌లోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతాఫల్‌మండి సీతారాంనగర్‌లోని రామలింగేశ్వర ఆలయంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శైలేందర్, ఆలయ ప్రధాన పూజారి మురళీదర శర్మ, వేణు పంతులు తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో...

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ దేవునితోట భవాని శంకర ఆలయంలో శనివారం కార్తిక మాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో జ్యోతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల పాటు ఉదయం, సాయంత్ర వేళల్లో పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు.

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ..

ఖైరతాబాద్, నవంబర్ 2 : మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకున్న కేసులో నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రికి చెందిన బత్తల శ్యామ్ ప్రసాద్ లక్డీకాపూల్‌లోని వినాయక్‌నగర్‌లో ఉంటున్నాడు. 2022 అక్టోబర్‌లో డీపీ కాలనీకి చెందిన విజయకు మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానంటూ నమ్మించి రూ.1.18లక్షలు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోవడంతో గతేడాది జనవరిలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సకాలంలో చికిత్సతో స్ట్రోక్ నుంచి ఊరట

అవగాహన శిబిరంలో రోగులతో డాక్టర్ అనిరుధ్‌రావు దేశ్‌ముఖ్

అమీర్‌పేట్, నవంబర్ 2: బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన మూడు గంటల్లో ఆసుపత్రికి తరలించి తగిన వైద్య చికిత్స అందిస్తే పూర్తి ఉపశమనం పొందవచ్చని ప్రముఖ స్ట్రోక్ స్పెషలిస్ట్ డాక్టర్ అనిరుధ్‌రావు దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకొని అమీర్‌పేట్ ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో స్ట్రోక్ లక్షణాలు, వాటిని గుర్తించడం ఎలా అనే అంశాలపై రోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు సామాన్యులకు అవగాహన కల్పించారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు మెదడుకు జరగాల్సిన రక్త ప్రసరణ నిలిచిపోవడం వల్ల దాని ప్రభావం శరీరంలోని అవయవాలపై పడుతుందని, ఈ ప్రభావంతో కాళ్లు చేతులు చచ్చుబడిపోవడం, కంటి చూపు పోవడం, జ్ఞాపక శక్తి తగ్గిపోవడం, మూతి వంకర, మాట రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే దీనిని స్ట్రోక్‌గా పరిగణించాలని ఆలస్యం చేయకుండా వెంటనే తగిన ఇంజెక్షన్ చేయడం, మెకానికల్ థ్రాంబెక్టమీ చేయడం లేదా తీవ్రతను బట్టి శస్త్రచికిత్స నిర్వహించడం వల్ల రోగిని సాధారణ స్థితికి తీసుకురావచ్చని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ అనుమానాలను వైద్యుల వద్ద ప్రస్తావించి సమాధానాలు పొందారు.

పెండ్లి పేరుతో మోసం

వెంగళరావునగర్, నవంబర్ 2 : ప్రేమించి.. పెండ్లి చేసుకుంటానని నిమ్మించి.. యువతిని గర్భం చేసి మోసం చేశాడు. ఈ ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీ, గుంటూరు జిల్లా, ఇటుకూరుకు చెందిన యువతి నగరానికి వచ్చి మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నది. ఆ గ్రామానికి చెందిన శివకార్తిక్ దాసరి అక్కడే ఉంటూ ఆమెను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. పెండ్లి చేసుకుంటానని 2018 అక్టోబర్ 27న యాదగిరిగుట్టకు తీసుకెళ్లి ఓ హోటల్‌లో లోబర్చుకున్నాడు. మరుసటిరోజు హాస్టల్ వద్ద దింపి వెళ్లిపోయాడు. ఆ తర్వాత స్నేహితుడి ఇంటికి తీసుకువెళ్లి తాళి కట్టి పెండ్లి అయిపోయిందని చెప్పి.. సహజీవనం చేయగా ఆమె గర్భం దాల్చింది. బలవంతంగా అబార్షన్ ట్యాబ్లెట్లు వేయగా..తీవ్ర రక్తస్రావమై కడుపులోని పిండం ఛిద్రమైంది. అనారోగ్యంతో ఆమె తన స్వగ్రామానికి వెళ్లిపోయింది. నగరానికి వచ్చిన యువతిని 2021 జనవరిలో పెండ్లి చేసుకుంటానని నమ్మించి కోరికను తీర్చుకున్నాడు. ఎంతకీ పెండ్లి చేసుకోకపోవడంతో మోసపోయానని గుర్తించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉన్నది.

ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్యంపై 'గాంధీ'లో సదస్సు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 2: ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సమస్యలపై సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల ఆలుమ్ని హాలులో శనివారం వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశేఖర్‌రావు, ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ రాజకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబోద్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ త్వరలో గాంధీ దవాఖానలో కూడా ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా క్లినిక్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. లింగ మార్పిడి చేయించుకున్న ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సమస్యలు వివిధ విభాగాల సమన్వయంతో పరిష్కరించాల్సిందని, అందుకే ప్లాస్టిక్ సర్జరీ, గైనకాలజీ, ఎండోక్రైనాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఫిజియాలజీ, ఫోరెన్సిక్, సైకియాట్రిక్ విభాగాల ప్రొఫెసర్లతో కలిసి తొలిసారిగా సదస్సులో తమ అభిప్రాయాలను, అనుభవాలను వివరించారు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్యం, వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిందని తెలిపారు. వారు తమ ఆరోగ్య సమస్యలను నిర్భయంగా చెప్పుకోవడానికి తగిన వైద్య విభాగం ఉండాలని చెప్పిందని అన్నారు. ఇప్పటికే తెలంగాణలో 32 క్లినిక్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. సదస్సుకు అనూహ్య స్పందన లభించిందని, దేశవ్యాప్తంగా 500 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, ప్రత్యక్ష ప్రసారంలో వీక్షిస్తున్నారని తెలిపారు. దేశంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ ఆర్థోపెడిక్ వైద్యురాలు, డాక్టర్ ప్రాచీ రాథోడ్ హాజరై తన అనుభవాలను వివరించారు. ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్, ఎండోక్రైనాలజీ హెచ్ఓడీ డాక్టర్ రాకేశ్‌కుమార్ సహాయ్, చేవెళ్ల వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డి.జోయారాణి, సిద్దిపేట వైద్య కళాశాల గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.మహాలక్ష్మి, ఉస్మానియా వైద్య కళాశాల ప్లాస్టిక్ సర్జరి ప్రొఫెసర్ పి.లక్ష్మి, ఎయిమ్స్ బీబీనగర్ వైద్య కళాశాల సైకియాట్రిక్ విభాగం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ మాలతేశ్, యాదాద్రి భువనగిరి వైద్య కళాశాల ఫొరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ లావణ్య కౌసిల్ తదితరులు ఈ సదస్సులో పలు అంశాలపై ప్రసంగించారు.

అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రాజకుమారి, డాక్టర్ ఇందిర, డాక్టర్ రమాదేవి

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

మేడిబావిలో రాంపల్లి సత్యంగౌడ్, మంగ దంపతులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

మైలార్‌గడ్డలో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

సికింద్రాబాద్, నవంబర్ 2: చీకట్లను చీల్చి వెలుగు నిచ్చే దీపావళిని ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. పండుగను పురస్కరించుకొని బొమ్మల కొలువు మూడు రోజుల పాటు ఏర్పాటు చేస్తారు. సంప్రదాయ పద్ధతిలో పలు రకాల దేవతా విగ్రహాలతోపాటు ఆకట్టుకునే ప్రతిమలను ఏర్పాటు చేస్తారు. దీపావళిని పురస్కరించుకొని మేడిబావి, మైలార్‌గడ్డ ప్రాంతాల్లో పలువురు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల వారు బొమ్మల కొలువును చూసేందుకు ముచ్చట పడుతున్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు

బొల్లారం, నవంబర్ 2: రిసాల బజార్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్ హాజరై దున్నపోతుల విన్యాసాలను తిలకించారు.

అంబరాన్నంటిన వేడుకలు

మారేడ్‌పల్లి: మారేడ్‌పల్లిలో సదర్ వేడుకలు అంబారాన్నంటాయి. సన్నియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మారేడ్‌పల్లి, రెజిమెంటల్‌బజార్, కార్ఖానా, పికెట్, అంబేద్కర్‌నగర్, జయప్రకాశ్‌నగర్ ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దున్నపోతుల విన్యాసాలను తిలకించారు. మారేడ్‌పల్లిలోని బూసారెడ్డిగూడ నుంచి ప్రారంభమైన సదర్ ర్యాలీ హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేశ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

సదర్ ఉత్సవాల్లో జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్

మెట్టుగూడ డివిజన్ ఏఈకి బాధ్యతలను స్వీకరించిన సదాజను స్థానిక కార్పొరేటర్ రాసురి సునీత మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు.
- అడ్డగుట్ట, నవంబర్ 2

ఐదుగురిపై కేసు నమోదు

బంజారాహిల్స్ : డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది.వివరాల్లోకి వెళ్తే.. కవాడిగూడకు చెందిన ఐటీ ఉద్యోగి సిద్ధార్థ తన స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని క్లబ్ రోగ్ పబ్‌లో శుక్రవారం రాత్రి విందు ముగించుకుని కారులో బయలుదేరాడు. పార్క్‌హయత్ హోటల్ వద్దకు రాగానే బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల కోసం ఆపారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేసేందుకు యత్నించగా సిద్ధార్థ, అతడి స్నేహితుడు శేష సాయిప్రసాద్, కుటుంబసభ్యులు వాగ్వాదానికి దిగి దుర్భాషలాడారు. వీడియోలు తీస్తూ విధులకు అడ్డుకున్నారు. సిద్ధార్థకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా 70 బీఏసీ పాయింట్లు వచ్చింది. విధులు అడ్డగించడంతో పాటు బెదిరింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్సై గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదుతో సిద్ధార్థ, శేష సాయిప్రసాద్‌తో సహా ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

ఆశ్రయమిస్తే ఆభరణాల చోరీ

బంజారాహిల్స్: నమ్మి ఆశ్రయమిచ్చిన యువతిని మోసం చేసి ఆభరణాలతో ఉడాయించిన మహిళపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. ఒరిస్సాకు చెందిన గీతాంజలి మహాపాత్ర బంజారాహిల్స్ రోడ్ నం.14లోని రోజ్ ట్రీ కాఫీషాప్‌లో రిసెప్షనిస్ట్. ఇటీవల ఒరిస్సాకు చెందిన కల్యాణి బెహెరా తన ఎనిమిదేళ్ల కొడుకుతో నగరానికి వచ్చింది. పని ఇప్పించాలని గీతాంజలిని కోరింది. ఉద్యోగం చూస్తానని, అప్పటి వరకు తన ఇంట్లోనే ఉంటూ పనులు చూసుకోవాలని గీతాంజలి ఆమెకు సూచించింది. గత నెల 29న గీతాంజలి ఆఫీస్‌లో ఉండగా కల్యాణి ఫోన్‌చేసి తన కొడుకుకు హాస్టల్‌లో సీటు వచ్చిందని, ఊరెళ్లి చేర్పించి వస్తానంటూ చెప్పింది. అంగీకరించిన గీతాంజలి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చింది. మరుసటి రోజు లగేజ్ బ్యాగ్‌లో పెట్టిన రూ.10వేలు కనిపించకపోవడంతో పాటు రెండున్నర తులాల బంగారు చెవిరింగులు, 5 గ్రాముల వెండి బ్రాస్‌లెట్ మాయమయ్యాయి. అన్ని చోట్లా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కల్యాణి మీద అనుమానం వచ్చి ఫోన్ చేయగా స్పందించ లేదు. శనివారం బాధితురాలు గీతాంజలి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.